సాక్షి అన్నమయ్య జిల్లా

గురువారం । 23 । నవంబర్ । 2023



మధ్యాహ్న భోజనంలో బల్లి

మదనపల్లె మండలం టేకులపాలెం ఎంపీ యూపీ పాఠశాలలో బుధవారం మధ్యాహ్న భోజనంలో బల్లి పడింది. ఈ ఆహారం తిన్న విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. -8లో



దోచుకున్న సంఘమిత్రలు!

మహిళా సంఘాల సభ్యులకు అందించే రుణాలు దుర్వినియోగం చేసిన ఉదంతం వెలుగులోకి వచ్చింది. తంబళ్లపల్లెలో రుణాల స్వాహా వ్యవహారం బట్టబయలైంది. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.280	రూ.340
రెండోరకం	రూ.200	రూ.268



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 291 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	305	490
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 762.380 కిలోలు

న్యూస్‌రీల్

ఆర్‌బీకే ఆకస్మిక తనిఖీ



చిన్నఓరంపాడు రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి చంద్రనాయక్

ఓబులవారిపల్లె: ఆర్‌బీకేల ద్వారా అన్ని రకాల ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచాలని జిల్లా వ్యవసాయ అధికారి బి.చంద్ర నాయక్ అన్నారు. చిన్నఓరంపాడు రైతు భరోసా కేంద్రాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మల్లిక, రైతు భరోసా కేంద్రం ఇన్‌చార్జ్ నందిని తదితరులు పాల్గొన్నారు.

నేడు కళ్యాణమస్తు నిధులు విడుదల

రాయచోటి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గురువారం వైఎస్సార్ కళ్యాణ మస్తు, వైఎస్సార్ షాదీ తోఫా నిధులను విడుదల చేయనున్నారు. నాలుగో విడత నవంబర్ 23లో వివాహం చేసుకున్న అర్హులైన 342 జంటల ఖాతాలలో రూ. 2.76 కోట్లు ఆర్థిక సాయాన్ని వధువు తల్లుల బ్యాంకు ఖాతాలలో జమ చేయనున్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ ఆధ్వర్యంలో అర్హులకు అందజేసేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

నియోజకవర్గాల వారీగా వివరాలిలా..

రాయచోటిలో 72 జంటలకు రూ. 62.10 లక్షలు, రాజంపేట 48 గంటలకు రూ. 32.20 లక్షలు, కోడూరు 52 జంటలకు రూ. 40.72 లక్షలు, మదనపల్లి 50 గంటలకు రూ. 39.35 లక్షలు పీలేరు 74 జంటలకు రూ. 61 లక్షలు, తంబళ్లపల్లె 46 జంటలకు రూ.35.65 లక్షలు అందజేయనున్నారు.

కోటి దీపోత్సవానికి రామయ్య

ఒంటిమిట్ట: హైదరాబాద్‌లో గురువారం జరిగే కోటి దీపోత్సవంలో సీతారాముల కల్యాణానికి ఒంటిమిట్ట రామయ్య ఉత్సవమూర్తులను తీసుకెళ్తున్నట్లు ఆలయ డిప్యూటీ ఈఓ నటేష్ బాబు తెలిపారు. ఈ నేపథ్యంలో బుధవారం మూడో శతాబ్దానికి చెందిన ఈ ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ హనుమంతయ్య తదితరులు పాల్గొన్నారు.

ఒంటిమిట్టకు అయోధ్య అక్షింతలు

ఒంటిమిట్టకు బుధవారం ఆర్ఎస్ఎస్ నేత వేణుగోపాల్‌రాజు ఆధ్వర్యంలో అయోధ్య రామ మందిరం నుంచి అక్షింతలు చేరాయి. వీటిని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఉంచి నెల పాటు పూజలు చేస్తారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటి: అన్నమయ్య, చిత్తూరు, నెల్లూరు, తిరుపతి జిల్లాలలోని పర్యాటక రంగంలో ఉత్తమ పర్యాటక ప్రాంతాల ఎంపికకు గాను 2024 ఏడాదికి పర్యాటక మంత్రిత్వ శాఖ దరఖాస్తుల ద్వారా ఆహ్వానిస్తున్నట్లు జిల్లా పర్యాటక రీజనల్ డైరెక్టర్ రమణప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు పైన తెలిపిన జిల్లాలలోని వ్యవసాయ పర్యాటకం, బాధ్యతాయుత పర్యాటకం, వారసత్వ పర్యాటకం, కళాఖండాలు, శక్తివంతమైన గ్రామాలు, కమ్యూనిటీ ఆధారితం, ఆరోగ్య రంగాలకు సంబంధించిన వారు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులుగా రీజనల్ డైరెక్టర్ రమణప్రసాద్ పేర్కొన్నారు. వివరాలకు తిరుపతి జిల్లా పర్యాటక అధికారి రూపేంద్రనాథరెడ్డి (6309942027), చిత్తూరు జిల్లా పర్యాటక అధికారి నరేంద్ర (9966535697), అన్నమయ్య జిల్లా పర్యాటక అధికారి నాగభూషణం(6309942032)లను సంప్రదించాలని పర్యాటక శాఖ ఆర్డీ తెలిపారు.

సీడీసీ బృందం పర్యటన




జిల్లా ఆస్పత్రిలో సీడీసీ బృంద సభ్యుల పరిశీలన

మదనపల్లె: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో బుధవారం సెంటర్ ఫార్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్(సీడీసీ) బృంద సభ్యులు పర్యటించారు. సీడీసీ టీం డాక్టర్.మెర్లీసా ఆధ్వర్యంలో వైద్య బృంద సభ సభ్యులు రమేష్, తరుణ్, లోకేష్, వలంటరీ హెల్త్ సర్వీసెస్ సభ్యులు వెంకట్రామన్, సంపత్‌కుమార్, ఏపీ శాక్స్ పర్యవేక్షకుడు రాజేంద్రప్రసాద్ తదితరులు జిల్లా ఆస్పత్రిలోని ఏఆర్‌టీ, ఐసీటీసీ, ఎస్‌టీఐ, పీపీటీసీ, క్యాన్సర్ స్క్రీనింగ్ విభాగాలను పరిశీలించారు. మదనపల్లెలోని ఏఆర్‌టీ, ఐసీటీసీ విభాగాలు సమర్థవంతంగా పనిచేయడంతో పాటుగా, రోగుల గోప్యత పాటించడం, కౌన్సిలింగ్, మెడిసిన్స్ అందించడంలో విశేష కృషి చేస్తున్నట్లు తెలిసిందన్నారు.ఇక్కడందిస్తున్న సేవలను పైలట్ ప్రాజెక్ట్‌గా అధ్యయనం చేసి దేశంలోని ఇతర ప్రాంతాల్లో అందించేందుకు చర్యలు చేపట్టేలా ప్రభుత్వానికి నివేదిక పంపనున్నట్లు తెలిపారు. మెడికల్ సూపరింటెండెంట్ పద్మాంజలి, సర్జన్ హరగోపాల్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఆచరణలో సామాజిక న్యాయం!

పేదలకు రాజ్యాధికారంలో భాగస్వామ్యం, సంక్షేమంలో అగ్రపీఠం సీఎం వైఎస్ జగన్ సర్కార్‌లో దక్కింది. మునుపెన్నడూ లేని చరిత్రను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సృష్టించింది. అణగారిన వర్గాలను సొంతం చేసుకొని, వారి ఉన్నతికి విశేషంగా కృషి చేస్తోంది. మాటలకే పరిమితమైన సామాజిక న్యాయం ఆచరణలో చూపెట్టింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ఉన్నతే లక్ష్యంగా పనిచేస్తోంది.

- రాజ్యాధికారంలో భాగస్వామ్యం, సంక్షేమంలో అగ్రపీఠం
- వైఎస్ జగన్ సర్కార్‌లో బడుగు, బలహీన వర్గాల ఉన్నతికి విశేష కృషి
- కడప గడపకు సమున్నత గౌరవం డిప్యూటీ సీఎం హోదా
- నేడు కడపలో సామాజిక సాధికార యాత్ర



సాక్షి ప్రతినిధి, కడప: పేద ప్రజల జీవనాన్ని దగ్గరగా పరిశీలించిన సీఎంఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే, వారి ఉన్నతి లక్ష్యంగా అడుగులు వేస్తున్నారు. నాలుగున్నరేళ్ల పాలనలో రాజకీయంగా, సామాజిక పరంగా అగ్రపీఠం వేశారు. సంక్షేమ పథకాలు ద్వారా నేరుగా పేదలకు సాయం చేస్తున్నారు. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమానికి వివిధ ప్రభుత్వ పథకాల ద్వారా రూ.7,984.48 కోట్లు అందించారు. అందులో ఎస్సీలకు రూ.2,000.92 కోట్లు, ఎస్టీలకు రూ.212.47 కోట్లు, బీసీలకు రూ.5,263.09 కోట్లు, మైనార్టీలకు రూ.508 కోట్లు దక్కింది. చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా పేదలకు నేరుగా డబ్బులు అందిస్తోన్న చరిత్రను సొంతం చేసుకుందని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.

కడప గడపలో రూ.1,474కోట్లు పంపిణీ...

కడప నియోజకవర్గంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం వివిధ పథకాల వల్ల డైరెక్టు బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ ద్వారా రూ.1,474.92 కోట్లు అందించింది. నవరత్నాలు పథకాల్లో భాగంగా వివిధ సామాజిక వర్గాలకు చెందిన 1,40,072 మంది లబ్ధిదారులకు సంక్షేమ పథకాల లబ్ధి నేరుగా లబ్ధిదారులకే అందించింది. వారిలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు చెందిన 89,274 మంది లబ్ధిదారులున్నారు. వీరికి రూ.1,164.28 కోట్లు సంక్షేమ పథకాల రూపంలో లబ్ధి చేకూరింది. అందులో బీసీలకు రూ.526.42 కోట్లు, ఎస్సీలకు రూ.157.43కోట్లు, ఎస్టీలకు రూ.24.26 కోట్లు, మైనార్టీలకు రూ.456.17 కోట్లు అందించారు. ఇంతటి భారీ స్థాయి ఆర్థిక చేయూత చరిత్రలో ఎన్నడూ లభించలేదని విశ్లేషకులు భావిస్తున్నారు.

టీడీపీ శ్రద్ధంతా బలహీనవర్గాల ఓట్లు పైనే...

బడుగు బలహీన వర్గాల ఓట్లుపైనే టీడీపీ శ్రద్ధ చూపెట్టేదని, వారి ఆర్థిక, సామాజిక ఉన్నతికి ఏనాడు కృషి చేసిన దాఖలాలు లేవని పరిశీలకులు వెల్లడిస్తున్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చిన బీసీల జపం చేసేదని, ఆ తర్వాత పట్టించుకున్న పాపాన పోలేదని పలువురు వివరిస్తున్నారు. అధికారంలో ఉండగా, ఆదరణ పేరుతో పనిముట్లు పంపిణీ చేసి కులవృత్తులకు మాత్రమే పరిమితం అయ్యేలా చర్యలుండేవి. కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలకు మాత్రమే బడుగులను వాడుకునేదని రాజకీయ విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. మైనార్టీ వర్గాలకు చెందిన వ్యక్తి మంత్రి లేకుండా ఐదేళ్లు పాలించిన ఘనత చంద్రబాబు సర్కార్‌కు దక్కుతోందని పలువురు వివరిస్తున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కార్‌లో రిజర్వేషన్లు కంటే అధికంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు పదవులు అప్పగించి చరిత్ర సృష్టించిందని పలువురు వివరిస్తున్నారు.

▶▶కడప గడపకు అరుదైన గౌరవం...



ఎస్‌బీ అంజాద్‌బాషా



కె సురేష్‌బాబు

కడపకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అరుదైన గౌరవం దక్కింది. కడప ఎమ్మెల్యే అంజద్‌బాషాకు డిప్యూటీ సీఎం హోదా అప్పగించారు. కడప చరిత్రలో డిప్యూటీ సీఎం హోదా దక్కించుకున్న తొలి నాయకుడిగా అంజాద్ చరిత్రలో నిలవనున్నారు. కడప ప్రథమ పౌరుడుగా సురేష్‌బాబుకు రెండుపర్యాయాలు వరుసగా అవకాశం దక్కింది. ఉమ్మడి జిల్లాలో మరో ముస్లిం మైనార్టీ నేత జకియా ఖానమ్‌కు ఎమ్మెల్సీతోపాటు శాసనమండలి డిప్యూటీ చైర్మన్‌గా ఎంపిక చేశారు. బీసీలకు చెందిన రమేష్‌యాదవ్‌కు ఎమ్మెల్సీ లభించింది. మైనార్టీ నాయకుడు కరీముల్లాకు వేర్‌హౌస్ కార్పొరేషన్ చైర్మన్ చేశారు. నాయి బ్రాహ్మణ నేత యానాదయ్యకు టీటీడీ బోర్డు మెంబర్‌గా అవకాశం కల్పించారు. ఎస్సీలకు చెందిన పులి సునీల్ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్‌గిరి లభించింది. స్థానిక సంస్థల నుంచి రాష్ట్ర స్థాయి పదవుల వరకూ 372 మంది వివిధ హోదాల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మై నార్టీ వర్గాలకు చెందిన వారు జిల్లా నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్నారు.

▶▶ఆత్మగౌరవం నిలుపుకోవడం కోసం....

ఓ వైపు రాజకీయ పదవులు, మరోవైపు ప్రభుత్వ సంక్షేమ పథకాలతో బడుగులకు ఆత్మగౌరవం సగౌరవంగా నిలుస్తోంది. సీఎం వైఎస్ జగన్ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాల ద్వారా జగనన్న అమ్మ ఒడి, వైఎస్సార్ రైతు భరోసా, సున్నా వడ్డీ, ఉచిత పంటల బీమా, పింఛన్ కానుక, చేయూత, ఆసరా, బీమా, నేతన్న నేస్తం, జగనన్న చేదోడు, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, కళ్యాణమస్తు, షాదీతోఫా, జగనన్న తోడు తదితర పథకాల ద్వారా జిల్లాలోని 19,54,575 మంది లబ్ధిదారులకు రూ.12,061 కోట్లు లబ్ధి చేకూరింది. అందులో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు చెందిన 12,86,500 మంది లబ్ధిదారులున్నారు. ఆయా వర్గాలకు రూ.7,984.48 కోట్లు నేరుగా లభించింది. రాజకీయంగా అందలం అప్పగించడం ఓ వైపు ఆర్థిక చేయూత నివ్వడం మరోవైపు కొనసాగుతోన్న నేపథ్యంలో ఆత్మగౌరవం అలాగే కొనసాగేలా అడుగులు వేస్తున్నారు. బడుగులకు అండగా ఉంటున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వాన్ని బలపర్చాలని కోరుతూ చేపట్టిన సామాజిక సాధికార యాత్ర గురువారం కడపలో చేపట్టనున్నారు. రవీంద్రనగర్ యూస్ ఫంక్షన్ హాల్‌లో తటస్థులతో సమావేశం నిర్వహించిన అనంతరం ర్యాలీగా పాత కలెక్టరేట్ వద్దకు చేరుకొని అక్కడ బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి పలువురు మంత్రులు, నేతలు హాజరుకానున్నారు.

బీసీల ఆత్మబంధువు వైఎస్ జగన్



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీల ఆత్మబంధువుగా మారారు. బీసీలకు 56 కార్పొరేషన్లు చేసి చైర్మెన్లు, డైరెక్టర్లను నియమించారు. 54 ఏళ్ల చరిత్రలో కడప వ్యవసాయ మార్కెట్ యార్డు కు ఒక బీసీ మహిళ చైర్మెన్ కావడం ఇదే తొలిసారి. బీసీ జన గణనకు శ్రీకారం చుట్టిన గొప్ప నాయకుడు వైఎస్ జగన్. – బంగారు నాగయ్య యాదవ్, జిల్లా అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం

రాజ్యాధికారంలో దళితులకు అగ్రపీఠం



దళిత, బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాధికారం కల్పించడంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేశారు. రాష్ట్రంలో హోంమంత్రి పదవితోపాటు, ఉప ముఖ్యమంత్రి పదవి, విద్యాశాఖామంత్రి వంటి పదవులు ఎస్సీలకే ఇచ్చారు. దళితులు మా బంధువులని చెప్పిన మనసున్న నేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి. –సీహెచ్ వినోద్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం

మైనార్టీలంటే సీఎంకు మక్కువ ఎక్కువ



ముస్లిం మైనార్టీలపై సీఎంకుమక్కువ ఎక్కువ. చంద్రబాబు తన మంత్రివర్గంలోకి ఒక్క మైనార్టీని కూడా తీసుకోకుండా ముస్లింలను చిన్నచూపు చూశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నలుగురు మైనార్టీలను ఎమ్మెల్యేలుగా చేసి, అందులో కీలకమైన ఉప ముఖ్యమంత్రి పదవి ఇచ్చారు. మరో నలుగురికి ఎమ్మెల్సీ పదవులు ఇచ్చారు. ఉమ్మడి రాష్ట్రంలోనూ ఇన్ని పదవులు రాలేదు. – అహ్మద్‌బాషా, మైనార్టీ నాయకులు

మెరుగైన వసతుల కల్పనే ధ్యేయం

- త్వరలో మరో బస్టాండు నిర్మాణానికి కృషి
- నియోజకవర్గంలో మిగిలిన బస్టాండుల ఆధునికీకరణకు చర్యలు
- ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి



ఆర్‌ఎం కార్యాలయం ప్రారంభోత్సవంలో ఎంఎల్‌ఏ, ఆర్టీసీ చైర్మన్‌లు

రాయచోటి అర్బన్: ప్రయాణికులకు మరింత మెరుగైన సౌకర్యాలను కల్పించడమే ధ్యేయమని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, ఆర్టీసీ చైర్మన్ డి.మల్లికార్జునరెడ్డిలు అన్నారు.రూ. 2.50 నిధులతో పూర్తయిన ఆర్టీసీ అదనపు ప్లాట్‌ఫారం , డీఎం కార్యాలయం, డీపీటీఓ కార్యాలయం, ఏఎస్ఎల్ పార్శిల్ సర్వీసు, రిజర్వేషన్ కౌంటర్‌లను బుధవారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ రోజురోజుకు పెరుగుతున్న ప్రయాణికుల దృష్ట్యా బస్టాండును విస్తరించాలన్న విషయాన్ని సీఎం వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లి రూ.2.50 కోట్లు స్థలంతో పాటు పక్కనే ఉన్న రెవెన్యూ స్థలంను కేటాయింపచేసుకున్నట్లు తెలిపారు. పనులు వేగవంతంగా పూర్తిచేయించి ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. బస్సు డిపోను కూడా మరింతగా అభివృద్ధి చేస్తామన్నారు. చిన్నమండెం, గాలివీడులలో బస్‌స్టేషన్‌ల అభివృద్ధికి కూడా కృషిచేస్తున్నట్లు చెప్పారు. రాయచోటి నుంచి తిరుమలకు నేరుగా, కడపకు ఎలక్ట్రికల్‌బస్సులు నడిపేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. లక్కిరెడ్డిపల్లెలో రూ. 50 లక్షలతో బస్టాండు పునర్‌నిర్మాణం, రామాపురంలో రూ.15లక్షల ఎంపీ నిధులతో బస్‌షెల్టర్‌ల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ ప్రయాణికులకు అధునాతన వసతులను కల్పిస్తూ, ప్రయాణికుల అవసరాలను తీర్చడంపై దృష్టి సారించినట్లు తెలిపారు. రాష్ట్రంలో 2700 కొత్తబస్సులు త్వరలో అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. రాయచోటి నుండి హైదరాబాద్‌కు త్వరలో స్లీపర్ బస్సు సర్వీసులను నడిపించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బస్టాండులో కొత్తరుచులు క్యాంటీన్ ప్రారంభంలో వారు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఈడీ గిడుగు వెంకటేశ్వరరావు, డీపీటీఓ రాము, డీఎం ధనుంజయ, డీసీసీబీ డైరెక్టర్ వెంకట్రామిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్‌బాషా, డిసిఎంఎస్ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి,జడ్పీవైస్ చైర్మన్‌దేవనాథరెడ్డి, మార్కెట్‌కమిటీ చైర్మన్‌లు వండాడి వెంకటేశ్వర్లు, కర్ణపు విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేస్తాం

- హైడ్రో పవర్ ప్రాజెక్టు కోసం సేకరించే భూములకు చట్టపరిధిలో న్యాయమైన ధరలు చెల్లిస్తాం
- ప్రాజెక్టు ఏర్పాటుకు రైతులు సహకరించాలి



గ్రామ ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్న జిల్లా కలెక్టర్ గిరీష పీఎస్

వీరబల్లి (రాయచోటిటౌన్): భూముల సేకరణకు సంబంధించి వంగిమళ్ల రైతులకు న్యాయం చేస్తామని కలెక్టర్ గిరీష పీఎస్ తెలిపారు. బుధవారం వీరబల్లె మండలం వంగిమళ్ల సమీపంలో హైడ్రో పవర్ ప్రాజెక్టు కోసం భూములు సేకరించిన రైతులతో మాట్లాడారు. వంగిమళ్ల దిగువ రాచపల్లెలో రైతులతో కలసి గ్రామ సభను నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్ట్రీమ్ క్లోజ్డ్ లూప్ స్టోరేజ్ హైడ్రో పవర్ ప్రాజెక్టు ఏర్పాటు కోసం 616.56 ఎకరాలు అవసరం అవుతాయని తెలిపారు. ఈ భూసేకరణకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. 616.56 ఎకరాల భూములలో 121.78 ఎకరాలకు సంబంధించి మాత్రమే పట్టా, డీకేటీ ఉందని తెలిపారు. మిగిలిన భూమికి సంబంధించి ఎలాంటి డాక్యుమెంట్స్ (రికార్డులు) లేకుండా సాగు చేసుకొంటున్నారని తెలిపారు. కొన్ని నెలలుగా ఈ భూమిని సర్వే చేసి ఈ భూమిలో ఎవరున్నారని గుర్తించామని చెప్పారు. మరి కొంత మంది అనుభవంలో ఉన్నప్పటికీ వారి వద్ద ఎలాంటి రికార్డులు లేవన్నారు. మరికొంతమందికి అగ్రిమెంట్లు లేవు, రికార్డులు లేవన్నారు. ప్రాజెక్టు కోసం భూసేకరణ చేసి చట్ట ప్రకారం ప్రభుత్వ రేట్, ప్రాజెక్టు ఏర్పాటు చేసే కంపెనీ ఎంత ఇవ్వగలుగుతారనే అనే అంశాలపై రైతుల అభిప్రాయాన్ని తెలుసుకోవడానికి ఈ గ్రామ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా కొంత మంది రైతులు కలెక్టర్‌తో మాట్లాడుతూ ఈ ప్రాంతంలో అంతా నిరుపేద రైతులు ఉన్నారని అందరూ ప్రభుత్వం ఇచ్చిన భూమిని సాగు చేసుకొంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. ఈ ప్రాజెక్టు నిర్మించే ప్రాంతంలో భూమి చాలా సారవంతమైనదని, వీరబల్లె మామిడికి ప్రపంచ ప్రఖ్యాత ఉందన్నారు. కొండల్లో పడిన వర్షపు నీరు చెరువుల్లోకి చేరడంతో ఆ నీటిని వాడుకొంటున్నామని తెలిపారు. ప్రాజెక్టుకు నీరు ఎక్కడి నుంచి తీసుకొంటారు, ప్రాజెక్టు కోసం నీరు ఆపితే రైతులకు ఇబ్బంది కలుగుతుందని చెప్పారు. సాగులో ఉన్న భూమిలో చెట్లు, బోర్‌వెల్స్ ఉన్నాయని ఈ ప్రాజెక్టుతో వీటిని కూడా నష్టపోతామని వివరించారు. వీటిన్నింటినీ దృష్టిలో ఉంచుకొని రైతులకు న్యాయం చేయాలని కోరారు. రైతులకు అడిగిన ప్రశ్నలకు కలెక్టర్ స్పందిస్తూ ప్రాజెక్టు కోసం నీటిని అన్నమయ్య, చెయ్యేరు ప్రాజెక్టు నుంచి తీసుకొచ్చి అప్పర్ లోయర్ రిజర్వాయర్లకు పైపుల ద్వారా పంప్ చేస్తారని తెలిపారు. ఇక్కడ నీరు ఉండదనే భయం పెట్టుకోవద్దని తెలిపారు. అలాగే వాతావరణ కాలుష్యం కూడా ఉండదని వివరించారు. ప్రాజెక్టు కోసం ఏర్పాటు చేసే డంపింగ్ యార్డ్‌లో కూడా ప్రాజెక్టులో కూడా ప్రాజెక్టు మిషనరీ ఉంటుందన్నారు. ఈ నీటితో విద్యుత్ ఉత్పత్తి చేస్తారన్నారు. కింద నుంచి పైకి నీటిని పంప్ చేసి మళ్లీ కిందకు పంపుతారని దీని వలన ఎలాంటి వాతావరణ కాలుష్యం ఉండదని చెప్పారు. ఈ ప్రాజెక్టు వలన జిల్లాలో 2000 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి అవుతుందని పేర్కొన్నారు. సాగులో ఉన్న భూములకు సంబంధించిన రైతులకు డబ్బులు కూడా ఇస్తామని.. దీన్ని పారదర్శకంగా చేపడతామన్నారు. జేసీ ఫర్మాన్ అహమ్మద్ ఖాన్, ఆర్డీవో రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

బాబోయ్.. భూ దొంగలు!

గుర్రంకొండ మండలంలో నకిలీ పాసు పుస్తకాల బాగోతం వెలుగు చూసింది. భూ దొంగలు అనుబంధ సర్వే నంబర్లు సృష్టించి పాసు పుస్తకాలు పొందడమే కాకుండా ఏంచక్కా బ్యాంకుల్లో లక్షల రుణాలూ పొందారు. గుర్రంకొండ మండలం టి.రాచపల్లెలో ఇటీవల జరిపిన భూ రీసర్వేలో ఈ నిజాలు వెలుగు చూశాయి. ఈ తతంగం నడిపిందెవరు? ఇందులో అధికారుల పాత్ర ఎంత? నేతల ప్రమేయం ఏమైనా ఉందా? అధికారుల విచారణలో తేలాల్సి ఉంది.

- వెలుగులోకి నకిలీ పాసు పుస్తకాల దందా
- గుర్రంకొండలో భూ రీసర్వేలో వెలుగుచూసిన నిజాలు



తమ పేర్లతో ఉన్న భూములపై మరో సర్వేనంబర్లు సృష్టించి భూములు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకొన్నారని చూపిస్తున్న బాధిత రైతులు



బినామీ వ్యక్తులు బ్యాంకుల్లో రుణాలు తీసుకోవడం కోసం టి.రాచపల్లెలో చూపించిన రైతుల పొలాలు ఇవే..

గుర్రంకొండ: గుర్రంకొండ మండలం టి.రాచపల్లె పంచాయతీలోని 11 మంది రైతులకు పక్కనున్న రామాపురం గ్రామంలో పొలాలు ఉన్నాయి. ఇటీవల రెవెన్యూ అధికారులు సదరు పంచాయతీలో భూ రీసర్వే కార్యక్రమం నిర్వహించారు. పొలాలున్న రైతులందరు తమ పొలాల వద్దకు రావాల్సిందిగా కోరారు. సదరు 11 మంది రైతులు పొలాల వద్ద ఉండగా రెవెన్యూ రికార్డుల్లో మరో ముగ్గురు రైతులు ఉన్నట్లు గుర్తించారు. ఆ ముగ్గురు తమ గ్రామానికి చెందిన వారని కారని వారికి తమ భూముల సర్వేనెంబర్లలో వారికి భూములు ఎలా వచ్చాయని రెవెన్యూ అధికారులను ప్రశ్నించారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం తాము భూసర్వేకు వచ్చామని వారు చెప్పారు. దీంతో రైతులు బినామీరైతుల వన్‌బీల ఆధారంగా విచారణ చేయగా నిజాలు బయటపడ్డాయి.

- మదనపల్లెకు చెందిన హరికృష్ణ, చంద్రమోహన్, రామసముద్రం మండలానికి చెందిన చౌడప్ప గుర్రంకొండ మండలం టి.రాచపల్లెకు చెందిన సదరు 11 మంది రైతుల భూములకు సంబంధించిన సర్వేనెంబర్లలో బినామీ నెంబర్లు సృష్టించి లేని భూములను ఉన్నట్లుగా సృష్టించారు. వీరికి దరఖాస్తు చేసుకున్నదే తడవుగా రెవెన్యూ అధికారులు 2017 ఫిబ్రవరి 13న వీరికి ఒన్‌బీ, అడంగళ్, కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేశారు. సదరు బినామీ వ్యక్తులు సదరు పట్టాదారు పాసు పుస్తకాలు చూపించి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకుల్లో హరికృష్ణ పేరుతో రూ. 13.50 లక్షలు, చౌడప్ప పేరుతో రూ. 8.50లక్షలు, చంద్రమోహన్ పేరుతో రూ.7.50లక్షలు రుణాలు పొందారు.

పూర్తి స్థాయిలో విచారణ జరుపుతాం



టి.రాచపల్లెలో జరిన భూ అక్రమాలపై పూర్తి స్థాయిలో విచారణ జరుపుతాం. గతంలో రెవెన్యూ అధికారులు వారికి ఏ ప్రాతిపదికన పట్టాదారు పాసుపుస్తకాలు మంజురు చేశారో విచారణ చేస్తాం. బాధిత రైతులు ఫిర్యాదు చేస్తే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

– ఖాజాబీ. తహసీల్దార్, గుర్రంకొండ

వాళ్లు మా ఊరివాళ్లు కాదు



మా గ్రామంలో పలువురు రైతుల పేరుతో ఉన్న భూములకు అనుబంధంగా సర్వేనెంబర్లు సృష్టించి లేని భూములు ఉన్నట్లుగా చూపించిన మగ్గురు రైతులు మా ఊరికి చెందిన వారుకారు. వారిని ఎప్పుడు మేము చూడలేదు. మా పేర్లతో ఉన్న భూముల్లో వారు లేని సర్వేనెంబర్లు చూపించి భూములు ఉన్నట్లు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవడం దారుణం. – బాలిరెడ్డి, రైతు, టి.రాచపల్లె

అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి



మా గ్రామంలోని రైతుల పేర్లతో ఉన్న భూములను తమ పేర్లతో బినామీ సర్వేనెంబర్లు సృష్టించి ఆన్‌లైన్‌లో నమోదు చేసుకొన్న అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి. విచారణ జరపకుండా అధికారులు వారికి ఎలా పట్టాదారుపాసుపుస్తకాలు ఇచ్చారో అర్థం కావడం లేదు. ఇదే భూములను చూపించి బ్యాంకులను బురిడీ కొట్టించి రుణాలు తీసుకున్న వారిపై చర్యలు తీసుకోవాలి.

– అశోక్‌కుమార్‌రెడ్డి, రైతు, టి.రాచపల్లె

ఇద్దరు విద్యార్థినులకు కుక్కకాటు


కుక్కకాటుకు గురైన విద్యార్థిని

పీలేరురూరల్ : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న ఇద్దరు విద్యార్థినులు కుక్కకాటుకు గురయ్యారు. వివరాలిలా ఉన్నాయి. పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న టి. హరిప్రియ, పి. రెడ్డిలతను కుక్క కరిచింది. దీంతో హుటాహుటిన వారిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంపై స్పందించిన ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి


క్షతగాత్రులను దగ్గర ఉండి ఆసుపత్రికి తరలిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి

సంబేపల్లి : రాయచోటి పట్టణంలోని చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై రాయచోటి కాఫీడే సమీపంలో రెండు ద్విచక్రవాహనాలు అదుపుతప్పి ఢీ కొన్నాయి. ఆ సమయంలో తిరుపతికి వెళ్తున్న రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి క్షతగాత్రులు రెడ్డి, శేఖర్‌లను పరామర్శించి 108 వాహనం ద్వారా రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వారికి మెరుగైన వైద్యం అందేలా చూడాలని ఫోన్ ద్వారా వైద్యాధికారులకు సూచించారు. ఎమ్మెల్యే స్పందించిన తీరును పలువురు అభినందించారు.

మధ్యాహ్న భోజనంలో బల్లి


జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు


విద్యార్థులను అడిగి వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీఓ ఎం.ఎస్.మురళీ


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

- 27 మంది విద్యార్థులకు అస్వస్థత
- టీకులపాలెం పాఠశాలలో ఘటన
- ఎమ్మెల్యే నవాజ్‌బాషా ఆదేశాలతో తక్షణ వైద్యసేవలు
- ప్రాణాపాయం లేదన్న వైద్యులు

మదనపల్లె : మండలంలోని బొమ్మనచెరువు పంచాయతీ టీకులపాలెం ఎంపీయూపీ పాఠశాలలో బుధవారం మధ్యాహ్న భోజనంలో బల్లి పడింది. ఈ ఆహారం తిన్న 27 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. తల్లిదండ్రులు హుటాహుటిన మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. సర్పంచ్ దండుకరుణాకర్‌రెడ్డి ద్వారా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా తక్షణమే స్పందించి, వైద్యసిబ్బందిని అప్రమత్తం చేయడంతో జిల్లా ఆస్పత్రిలోని వైద్యులు పిల్లలకు వైద్యచికిత్స అందించారు. ముగ్గురు విద్యార్థులు వాంతులు అధికంగా చేసుకుని నీరసానికి లోనయ్యారు. మిగిలిన వారికి ఎలాంటి ఇబ్బంది లేకపోవడంతో ప్రాథమిక చికిత్స , అవసరమైన మందులు అందించి డిశ్చార్జి చేశారు. విద్యార్థులకు ఎలాంటి ప్రాణాపాయం లేదని జిల్లా ఆస్పత్రి వైద్యులు తెలిపారు. టీకులపాలెం ఎంపీయూపీ పాఠశాలలోని విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో భాగంగా బుధవారం వెజిటబుల్ రైస్, కుర్మా వడ్డించారు. విద్యార్థులు భోజనాన్ని ఆరగిస్తుండగా, పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థి తనకు వడ్డించిన భోజనంలో బల్లి పడి ఉండటాన్ని గమనించాడు. అప్పటికప్పుడే విషయాన్ని ఉపాధ్యాయులకు తెలపడంతో వారు ఆహారాన్ని పడేయాలని విద్యార్థులకు సూచించారు. బల్లి పడిన ఆహారం తినేశామన్న విషయం విద్యార్థులకు తెలియడంతో ఒక్కసారిగా వారందరిలో ఆందోళన అధికమైంది. పాఠశాలలో మొత్తం 103 మంది విద్యార్థులు ఉండగా, వారిలో భోజనాన్ని 84 మంది వరకు తిన్నారు. వీరిలో 27 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వెంటనే అప్రమత్తమైన పాఠశాల సిబ్బంది, గ్రామంలోని తల్లిదండ్రులకు విషయం తెలిపి, ఆటోలు, టూవీలర్స్, కారుల్లో విద్యార్థులను జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఎమ్మెల్యే నవాజ్‌బాషా ఆదేశాలతో అప్పటికే సిద్ధంగా ఉన్న వైద్యులు పిల్లలకు తక్షణ వైద్యసేవల్లో భాగంగా సెలైన్ బాటిల్స్ పెట్టి ప్రాణాపాయం లేకుండా చికిత్స అందించారు. ఎమ్మెల్యే నవాజ్‌బాషా, ఆర్డీఓ ఎం.ఎస్.మురళీ, డీఎస్పీ కేశప్ప, తాలూకా సీఐ సత్యనారాయణ పిల్లలను పరామర్శించి, తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు. ఈ ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి, వంట నిర్వాహకురాలు భాగ్యలక్ష్మి, పాఠశాల హెచ్ఎం శేఖర్‌నాయుడుపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఎంఈఓ ప్రభాకరరెడ్డి, రాజగోపాల్‌లను ఎమ్మెల్యే నవాజ్‌బాషా ఆదేశించారు.

ఘటనపై పలు అనుమానాలు..

మధ్యాహ్నభోజనం తిన్న విద్యార్థులకు అస్వస్థతపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పాఠశాలకు వంటగది ఉన్నప్పటికీ వంట నిర్వాహకురాలు ఆరుబయట వంట చేసింది. ఆహారంలో బల్లి పడిందని చెప్పిన ఎనిమిదో తరగతి విద్యార్థి హేమంత్‌ను బల్లిని ఏంచేశావని అడిగితే ఉపాధ్యాయులు పారేయమన్నారని చెప్పుకొచ్చాడు. పాఠశాలలో హెచ్ఎం శేఖర్‌నాయుడుతో పాటు మరో ఐదుగురు ఉపాధ్యాయులు ఉన్నప్పటికీ మధ్యాహ్నభోజనం వడ్డించే సమయంలో వారెవరూ పర్యవేక్షించలేదని తెలిసింది. విద్యార్థులను అడిగితే హెచ్ఎం కారు కడుక్కుంటున్నారని, ఉపాధ్యాయులు ఎవరూ లేకపోవడంతో ఎప్పటిలాగే విద్యార్థులే వడ్డించుకున్నామని తెలిపారు. అయితే...హెచ్ఎం, ఉపాధ్యాయులు చెప్పింది మరోలా ఉంది. విద్యార్థి హేమంత్‌కుమార్ ఆహారంలో బల్లి పడిందని అరిచాడే తప్ప తమకు చూపించలేదన్నారు. అతడి అరుపులకు పిల్లలు భయాందోళనకు గురయ్యారే తప్ప వాంతులు చేసుకోలేదన్నారు. వెంటనే ఆస్పత్రికి తీసుకురావడంతో సెలైన్, ఎలక్ట్రోరల్ ఫ్లూయిడ్స్ తాగించడం ద్వారా కోలుకున్నారని చెప్పారు. ఇదే విషయాన్ని ఎంఈఓకు హెచ్ఎం రాతపూర్వకంగా రాసి ఇచ్చారు. కాగా ఈ విషయాన్ని తమకు అనుకూలంగా మలుచుకోవాలని విద్యార్థి సంఘాలు, ప్రతిపక్షాలు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు.

పుట్టెడు దుఃఖంలోనూ విధి నిర్వహణ


ఆర్డీఓ తల్లి చెంగమ్మ

మదనపల్లె ఆర్డీఓ ఎం.ఎస్.మురళీకి మాతృవియోగం కలిగింది. బుధవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఆర్డీఓ మురళీ తల్లి చెంగమ్మ(96) అనారోగ్యంతో మృతిచెందారు. తల్లి మరణవార్తతో పుట్టెడు దుఃఖంలో ఉన్న ఆర్డీఓ మురళీకి మండలంలోని టీకులపాలెం ఎంపీయూపీ పాఠశాల విద్యార్థులు మధ్యాహ్న భోజనంలో బల్లి పడిన ఆహారం తిని అస్వస్థతకు గురయ్యారన్న విషయం తెలిసిన వెంటనే ఇంటి నుంచి నేరుగా జిల్లా ఆస్పత్రికి బయలుదేరారు. విద్యార్థుల నుంచి ఘటనకు కారణాలను తెలుసుకుని, జిల్లా ఆస్పత్రిలో వారికి అందిస్తున్న వైద్యసేవలపై ఆరాతీశారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అందరికీ బాగయ్యేవరకు వైద్యుల పర్యవేక్షణలో జాగ్రత్తగా చూసుకుంటామని భరోసా కల్పించారు. తర్వాత అక్కడి నుంచి సబ్‌కలెక్టరేట్‌కు చేరుకుని ఎన్నికల విధుల్లో భాగంగా అన్ని రాజకీయపార్టీల ప్రతినిధులతో ఓటరు జాబితా స్వచ్ఛీకరణపై సమావేశం నిర్వహించారు. అనంతరం సెక్టోరియల్ అధికారులతో పోలింగ్ కేంద్రాల్లో కల్పించాల్సిన మౌలిక వసతులు, రూట్ సౌకర్యాలపై చర్చించారు. ఆర్డీఓ తల్లి చెంగమ్మ అంత్యక్రియలు గురువారం మధ్యాహ్నం 12గంటలపైన స్వగ్రామం వి.కోట మండలం కృష్ణాపురంలో జరుగుతాయని తెలిపారు.

నవశకం



వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ప్రజల జీవన స్థితిగతులు మెరుగుపడ్డాయి. ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని సమస్యలకు కూడా మోక్షం లభించింది. కుల, ఆదాయ సర్టిఫికెట్లు, సొంత ఇళ్లు, మెరుగైన విద్య అందుతోందని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

– సాక్షి నెట్‌వర్క్

సొంతింటి కల నెరవేరింది



గతంలో మాకు సొంతిల్లు లేదు. అద్దె ఇంటిలో నివాసం ఉండేవాళ్లం. జగనన్న ప్రభుత్వంలో మాకు ఇంటిస్థలంతో పాటు ఇల్లు మంజూరైంది. ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి నగదు, స్టీల్, ఇసుక, తదితర ఇంటి సామగ్రి అందించింది. దీంతో ఇంటిని బాగా నిర్మించుకున్నాము. మా సొంతింటి కల నెరవేరింది. జగనన్నకు రుణపడి ఉంటాం.

- నాగలక్ష్మి, జీఎన్ నగర్, పీవీజీపల్లి పంచాయతీ, పుల్లంపేట మండలం

దశాబ్దాల సమస్య పరిష్కారం



ఉన్నత పాఠశాలలో దశాబ్దాలుగా తరగతి గదులు శిథిలావస్థకు చేరి పెచ్చులూడి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఎవరూ పట్టించుకోలేదు. వైఎస్ జగన్ సీఎం అయిన తర్వాత నాడు–నేడు కింద రూ.49 లక్షల రూపాయలతో నూతనంగా ఐదు తరగతి గదులను నిర్మించారు. ముఖ్యమంత్రి విద్యా వ్యవస్థలో తెచ్చిన పెను మార్పులతో ప్రభుత్వ పాఠశాలలు బాగుపడ్డాయి. విద్యార్థుల శాతం పెరిగింది. ఉపాధ్యాయులకు గౌరవం పెరిగింది.

- బుక్కే రాజునాయక్,ఇన్‌చార్జి హెచ్ఎం, ఓబులవారిపల్లె

స్వగ్రామంలో భూహక్కు పత్రం



మా గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం ఏర్పాటు చేసి మా భూమికి సంబంధించిన పత్రాలను ఇచ్చారు. గతంలో భూహక్కు పత్రాల కోసం మీ సేవకు వెళ్లి గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చేది. అంతే కాకుండా డబ్బులు ఎక్కువ చెల్లించాల్సి వచ్చేది. ప్రస్తుతం మా గ్రామంలోనే జగనన్న సురక్ష కార్యక్రమంలో అన్ని రకాల సేవలను అందించడం సంతోషకరం.

-షేక్ మస్తాన్ వలీ, వ్యాపారి, ఓబులవారిపల్లె

ఆరో తరగతి విద్యార్థిపై పైశాచికం

మెడకు తాడుతో ఉరివేసిన వైనం


రిమ్స్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థి

రామాపురం : మండలంలోని అంబేద్కర్ గురుకుల పాఠశాలలో మంగళవారం ఓ విద్యార్థి మరో విద్యార్థిపై పైశాచికంగా ప్రవర్తించాడు. వివరాలు ఇలా ఉన్నాయి. గురుకులంలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థి అదే విద్యాసంస్థలో 6వ తరగతి చదువుతున్న మరో విద్యార్థి మెడకు తాడు చుట్టి పాఠశాలలోని డార్మేటరీలో ఉరి తీశాడు. అదృష్టవశాత్తు ఆ విద్యార్థి జారి కిందపడి ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నాడు.

అయితే అపస్మారక స్థితిలో ఉన్న ఆ విద్యార్థిని గుర్తించిన తోటి విద్యార్థులు పాఠశాల సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే ఉపాధ్యాయులు కడప రిమ్స్‌కు తరలించారు. ఉపాధ్యాయులు మాత్రం విద్యార్థి కంప పొదల్లో పడి ఉన్నాడంటూ విద్యార్థి తల్లికి సమాచారం అందించారు. ఆమె కడప రిమ్స్‌కు చేరుకుని కొడుకు పరిస్థితిని చూసి తీవ్రంగా రోదించింది. విద్యార్థి మెడపై తాడుతో బిగించిన ఆనవాళ్లు.. గొంతు పూర్తిగా వాపు ఉండడంతో ఆమె రిమ్స్ అవుట్ పోస్టు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. గురుకుల పాఠశాలలో గతంలో కూడా విద్యార్థుల మధ్య అనేక మార్లు ఘర్షణలు జరిగాయి. ఈ పరిణామాలను అధికారులు తీవ్రంగా పరిగణించాల్సిన అవసరం ఉందని పలువురు పేర్కొంటున్నారు.

ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్య


ఆత్మహత్య చేసుకున్న తలారి వెంకటరమణ

రాయచోటిటౌన్: రాయచోటి ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పని చేసే తలారి వెంకటరమణ (53) ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. వెంకటరమణకు 15 ఏళ్ల క్రితం భార్య చనిపోయింది. ఆమెకు ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. ఈ నేపథ్యంలో రెండో వివాహం చేసుకున్నాడు. ఈమెకు ఒక పాప సంతానం. ఈ క్రమంలో రెండవ భార్య బుధవారం ఉదయం పుట్టింటికి వెళ్లింది. పిల్లలు కూడా ఎక్కడో చదువుకుంటున్నారు. ఇంటిలో ఎవరూ లేని సమయంలో బుధవారం రాత్రి ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. ఇరుగు పొరుగు వారు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

అందినకాడికి దోచుకున్న సంఘమిత్రలు!

- సీసీతో కలిసి రూ.14.35 లక్షలు స్వాహా
- తంబళ్లపల్లె సీసీ శ్రీనివాసులు సస్పెన్షన్
- ఇద్దరు సంఘమిత్రలపై క్రిమినల్ కేసుకు ఆదేశం


వైఎస్సార్‌క్రాంతి పథం తంబళ్లపల్లె కార్యాలయం

బి.కొత్తకోట : మహిళా సంఘాల సభ్యులకు అందించే రుణాలు దుర్వినియోగం, స్వాహా చేసిన మరో ఉదంతం వెలుగులోకి వచ్చింది. పెద్దతిప్పసముద్రంలో రూ.20 లక్షలకుపైగా స్వాహా చేసిన అవినీతి వెలుగుచూసిన విషయం తెలిసిందే. తాజాగా తంబళ్లపల్లెలో రుణాలు స్వాహా చేసిన వ్యవహారం బట్టబయలైంది. దీనిపై ఒకరిని సస్పెండ్ చేయగా, ఇద్దరు సంఘమిత్రలపై క్రిమినల్ కేసు నమోదుకు డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ సత్యనారాయణ ఆదేశాలు జారీ చేశారు. దీనికి సంబంధించిన వివరాలు.

వైఎస్సార్‌క్రాంతి పథం ద్వారా మహిళా సంఘాలకు గ్రామ సమాఖ్యల ద్వారా ఉన్నతి, సీఐఎఫ్, స్త్రీ నిధి రుణాలను మంజూరు చేస్తుంటారు. స్త్రీ నిధికి సంబంధించి ఒక్కో సంఘం నెలకు రూ.100 పొదుపు చేయాలి. విజయవాడ ప్రధాన కార్యాలయ అధికారులు ఒక్కో సంఘానికి రూ.3.50 లక్షలు మంజూరు చేస్తారు. ఈ రుణం పొందిన సంఘాల సభ్యుల నుంచి నెలవారీ కంతులను సంఘమిత్రలు వసూలుచేసి బ్యాంకు ఖాతాలకు జమ చేయాలి. ఉన్నతి పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీలకు చెందిన ఒక్కో సభ్యురాలికి వడ్డీ లేకుండా రూ.50వేల రుణం ఇస్తారు. కంతుల చెల్లింపులో జాప్యం జరిగితే వడ్డీని వసూలు చేస్తారు. గ్రామసమాఖ్యల ద్వారా కమ్యూనిటి ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ కింద రుణాలు చెల్లిస్తారు. అయితే తంబళ్లపల్లె మండలంలో మంజూరుచేసిన ఈ రుణాల్లో భారీగా అక్రమాలు వెలుగులోకి వచ్చాయి.

రూ.13.95 లక్షలు స్వాహా

తంబళ్లపల్లె మండలంలోని జుంజురపెంట, కోటకొండ-2 సంఘమిత్రల పరిధిలో మహిళా సంఘాల సభ్యులకు రుణాలు మంజూరు చేశారు. మంజూరు చేసిన రుణాల్లో సభ్యులకు చేరలేదు. చేరినా తిరిగి వసూలైన కంతుల డబ్బు ఖాతాలకు జమకాలేదు. దీనిపై అధికారులతో విచారణ బృందం నియమించగా విచారించారు. సభ్యుల నుంచి రుణాల కంతులు వసూలైన సంఘమిత్రలు ఖాతాలకు జమ చేయలేదు. నిధులంతా స్వాహా చేశారు. దీనికి తంబళ్లపల్లె సీసీ పి.శ్రీనివాసులు నిధుల స్వాహాకు సహకరించడంతో స్వాహాకు అడ్డులేకుండా పోయింది. ఈ వ్యవహారంలో జుంజురపెంట సంఘమిత్ర హేమావతి స్త్రీనిధి రుణాలు రూ.5,30,126, ఉన్నతి రుణాలు రూ.41,990, సిఐఎఫ్ రుణాలు రూ.1,27,975 కలిపి మొత్తం రూ.9,08,602 స్వాహాచేసినట్టు నిర్ధారించారు. అలాగే కోటకొండ-2 సంఘమిత్ర సుభాషిణి స్త్రీనిధి రుణాలు రూ.5,61,721, ఉన్నతి రుణాలు రూ.1,73,526 కలిపి మొత్తం రూ.5,17,827 స్వాహా చేసినట్టు నిర్ధారించి చిత్తూరు డీఆర్‌డీఏ పీడీ తులసికి నివేదించారు. వీరిలో సీసీ శ్రీనివాసులును సస్పెండ్ చేస్తూ ఈనెల 17న పీడీ ఉత్తర్వులు జారీ చేశారు. సంఘమిత్రలు నిధులు స్వాహా చేయడం తేలడంతో వారిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని అన్నమయ్య జిల్లా పీడీ సత్యనారాయణ తంబళ్లపల్లె ఏపీఎంను ఈనెల 17న ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఆరోపించి ఇరుక్కున్నారు

ఇటీవల తంబళ్లపల్లెలో సంఘమిత్రలతో ఉన్నతాధికారులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు పెద్దతిప్పసముద్రం మండలంలో నిధుల స్వాహా విషయాన్ని ప్రస్తావించారు. ఆరోపణలు రాకుండా పనిచేయాలని సలహా ఇచ్చారు. అయితే కొందరు సంఘమిత్రలు అవినీతిలో భాగస్వామ్యం లేనిది ఎవరికని ప్రశ్నించారు. దీనిపై అధికారులు ఇక్కడి పరిస్థితిపై ఉన్నతాధికారులకు లేఖ ద్వారా నివేదించగా విచారణకు ఆదేశించగా ఈ అక్రమాలు వెలుగులోకి వచ్చాయి.

జాతీయ సాఫ్ట్‌బాల్ క్రీడా పోటీలకు ఎంపిక


జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రాయచోటిటౌన్ : జాతీయ స్థాయిలో నిర్వహించే సాఫ్ట్‌బాల్ క్రీడా పోటీలకు రాయచోటిలోని సుగవాసి రాజారాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు తొమ్మిదో తరగతి విద్యార్థులు ఎంపికైనట్లు ఆ పాఠశాల ఇన్‌చార్జి వై. శ్రీనివాసులు తెలిపారు. ఈ నెల 18వ తేదీ నుంచి 20వ తేదీ వరకు గుంటూరు జిల్లా వెనిగండ్ల మండలం శ్రీ వేమన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ అండర్ -14 విభాగపు పోటీలలో తమ పాఠశాల నుంచి మొత్తం ఐదుగురు పోటీలలో పాల్గొన్నారని తెలిపారు. వారిలో కె. అరాఫత్, వి.రంజిత్‌కుమార్, వి.సోమరాజు ఉత్తమ ప్రతిభ కనబరిచారన్నారు. వీరు ఛత్తీస్‌గఢ్‌లో నిర్వహించే జాతీయ స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పాటు ఫిజికల్ డైరెక్టర్లు అంబటి జగదీశ్వరయ్య, సీబీ మనోహర్‌రెడ్డిలను అభినందించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ సుగవాసి ఈశ్వర్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రగ్బీ పోటీలకు ఎంపిక


అభిషేక్

గాలివీడు : మండల కేంద్రం లోని గౌతమ్ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో 9వ తరగతి విద్యార్థి అభిషేక్ జాతీయ స్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల యాజమాన్యం శింటో ఇమ్మాను యేల్, సైజుథామస్ తెలిపారు. ఈనెల 21న కర్నూలులో జరిగిన అండర్ 17 రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొని జాతీయ స్థాయికి ఎంపికయ్యాడన్నారు. పూణేలో జరిగే జాతీయ స్థాయి పోటీలలో పాల్గొంటాడని తెలిపారు.

B.KOTHAKOTA NAGARPANCHAYATH

Roc.No : 1795/2022/E1 Dt:22.11.2023

'e' Procurement Tender Notice

4th call(short) Tender Notice

1. No. of Works	: **13 No's**
2. T.S.Amount / E.C.V. Amount	: **44.92 Lakhs**
3.Bid Document Downloading Start Date	: 23.11.2023 at 11.00 A.M
4.Bid Document Downloading End Date	: 01.12.2023 at 04.00 P.M
5.Bid Document Submission Closing Date	: 01.12.2023 at 04.30 P.M
6.Price Bid Opening Date	: 01.12.2023 at 04.45 A.M
7.Name & Address of the Concerned Officer	: Commissioner, B.Kothakota Nagarpanchayath B.Kothakota-517370 Cell: **9110510070**

Further details can be seen @ e-procurement market place at https://tender.apeprocurement.gov.in from **23.11.2023 at 11.00 A.M.**

Sd/- **COMMISSIONER** , B.Kothakota Nagarpanchayath.